



# వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 344 ఎడిటర్: కె.యువరాజ్ బుధవారం 22-9-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు


## వరంగల్ ఎయిర్‌పోర్టుకు రాణి రుద్రమ పేరు!

**- ఆదిలాబాద్ విమానాశ్రయానికి కొమురం భీం.. - ఎయిర్‌పోర్టుల డిజైన్లపై సీఎం రేవంత్ ఆగ్రహం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (వన్‌నేషన్):** వరంగల్ జిల్లా మామునూరు, ఆదిలాబాద్ జిల్లాలోని విమానాశ్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం పేర్లను ఖరారు చేసింది. మామునూరు ఎయిర్‌పోర్టుకు రాణి రుద్రమ, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు కొమురంభీం పేర్లను దాదాపు ఖరారు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. రెండు పేర్లు కొలిక్కిరావడంతో సంబంధిత ఫైలును క్యాబినెట్ ముందుకు తీసుకెళ్లేలా అధికారులు చర్యలు చేపట్టారు. క్యాబినెట్‌లో ఈ పేర్లకు ఆమోదం లభించగానే.. ఈ విషయాన్ని తెలుపుతూ అవే పేర్లను ఖరారు చేయాలని కోరుతూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా లేఖ రాయనుంది. అక్కడి నుంచి కూడా ఆమోదం రాగానే రెండు ఎయిర్‌పోర్టుల పేర్లతో గెజిట్ విడుదల చేయనున్నట్టు అధికార వర్గాల ద్వారా తెలిసింది. మంగళవారం వరంగల్, ఆదిలాబాద్, ఎయిర్‌పోర్టులపై నిర్వహించిన సమీక్షలోనే ఈ పేర్లు దాదాపు ఖరారయ్యాయని, ఈ పేర్లపైనా కొద్దిసేపు చర్చ జరిగిందని సమాచారం. ఏపీలో ఇటీవల ప్రారంభించిన బోగాపురం ఎయిర్‌పోర్టు అల్లూరి సీతారామరాజు పేరు, ఒర్వకల్లు ఎయిర్‌పోర్టుకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేర్లు పెట్టిన అంశం కూడా చర్చకు వచ్చింది. అదే తరహాలో తెలంగాణకు వచ్చే విదేశీయులకు, ఇతర దేశాల ప్రతినిధులకు కూడా తెలంగాణ చరిత్ర, ఆ పేర్లు కలిగిన వారు చేసిన కృషి, పోరాట పటిమ తెలియాలంటే వారి పేర్లే సరైనవన్న అభిప్రాయం వ్యక్తమైందని తెలిసింది. ఈ నేపథ్యంలోనే రాణి రుద్రమ, కొమురంభీం పేర్లు దాదాపు ఖరారయ్యాయని సమాచారం. అయితే మామునూరు ఎయిర్‌పోర్టు విషయంలో సమ్మక్క-సారలమ్మ పేరు కూడా పరిశీలనలో ఉందని దీనిపై కొద్ది రోజుల్లోనే స్పష్టతవచ్చే అవకాశం ఉందని కూడా అధికారికవర్గాలు పేర్కొంటున్నాయి. ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్‌పోర్టులపై సమీక్ష సందర్భంగా చూపించిన రెండు డిజైన్లపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కలెక్టర్లు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**- నదుల్లో ప్రవాహాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి - మంత్రులు, సీఎస్, డీజీపీలతో సమీక్షలో సీఎం**



**అమరావతి, సెప్టెంబర్ 23 (వన్‌నేషన్):** తీవ్ర వాయుగుండం కారణంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉన్నం దున ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులు అప్ర మత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆకస్మిక వరదల వల్ల ముంపు బారిన పడే అవకాశం ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. నదుల్లో ప్రవాహాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, రిజర్వాయర్లలో నీటి నిల్వలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. భారీ వర్షాలపై బుధవారం మంత్రులు, సీఎస్, డీజీపీతో పాటు ఆయా శాఖల అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 261 మండలాల్లో 129 మండలాలకు భారీ వర్షం, 121 మండలాల్లో సాధారణ వర్షం, 9 మండలాల్లో అతిభారీ వర్షం, 2 మండలాల్లో తీవ్ర వర్షం పడుతుందని అంచనా వేసినట్లు అధికారులు చెప్పారు.ఐవాయుగుండం తీరం దాటినా.. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లంతా అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. బుధవారం రాత్రి క్యాంప్ కార్యాలయం నుంచి వర్షప్రభావిత జిల్లాల కలెక్టర్లతో సీఎం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, 24,25 తేదీల్లో కలెక్టర్లు అలెర్ట్‌గా ఉండాలన్నారు. శ్రీకాకుళం జిల్లాలో వరి ఎంత మేర దెబ్బతిన్నదో అంచనా వేయాలన్నారు. వర్షప్రభావం ఉన్న జిల్లాల్లో గురువారం కూడా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని చెప్పారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులను కూడా వెనక్కి వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## 'ఎల్‌నినో'తో 4.5 లక్షల మరణాలు

**- ఫిబ్రవరిలోపు ప్రపంచవ్యాప్తంగా సంభవించే ప్రమాదం.. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు - భారత్‌పైనా తీవ్ర ప్రభావం - 15,800 మందికి ప్రాణాపాయం - భారత్‌పైనా గణనీయంగా ప్రభావం.. రానున్న వేసవి నిప్పుల కుంపటే**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 (వన్‌నేషన్):** రానున్న నెలల్లో ఎల్‌నినో తీవ్రతరమై సూపర్ ఎల్‌నినోగా మారి, వాతావరణ ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగనున్నాయని.. ఫలితంగా వచ్చే ఏడాది ఫిబ్రవరిలోపు 4,51,000 మరణాలు సంభవించే ప్రమాదం ఉందని ఓ అధ్యయన సంస్థ హెచ్చరించింది. అమెరికాకు చెందిన క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ అనే సంస్థ ఓ నివేదికను విడుదల చేసింది. ఎల్‌నినో వల్ల దక్షిణార్ధగోళంలోని దేశాల్లోనే ఉండటం గమనార్హం. నైజీరియా, సుడాన్, నైగర్, చాద్ తదితర ఆఫ్రికా దేశాల్లో 66,800 మంది, ఫిలిప్పీన్స్, వియత్నాం, థాయ్‌లాండ్, కాంబోడియా తదితర దేశాల్లో 19,400 మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, భారత్‌లో 15,800 మంది, బ్రెజిల్‌లో 13,300 మంది మరణిస్తారని తెలిపింది. ఈ మరణాలను నివారించటానికి ప్రభుత్వాలు ఉష్ణోగ్రతలకు సంబంధించిన హెచ్చరికలు జారీ చేయటం, కూలింగ్ సెంటర్లను ఏర్పాటు చేయటం, ప్రజలకు వడదెబ్బ నుంచి ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టటం, బహిరంగ స్థలాల్లో పని చేసే కార్మికులకు రక్షణ కల్పించటం, ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయటం వంటి చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఉత్తరార్ధగోళంలో సెప్టెంబరు-నవంబరు మధ్య ఉండే శరదృతువులో, శీతాకాలంలో అత్యంత తీవ్ర ఎల్‌నినోకు 90శాతం అవకాశం ఉందని పేర్కొంది. "ఎల్‌నినో తీవ్రత ప్రభావం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోంది. ఈ ఏడాది ఆగస్టు నెల.. చరిత్రలోనే అత్యంత ఉక్కపోత నమోదైన ఆగస్టు నెలగా రికార్డుల్లోకి ఎక్కింది. ఇది వేగంగా తీవ్రతరమవుతున్న ఎల్‌నినోకు, దీర్ఘకాలంపాటు కొనసాగే గ్లోబల్‌వార్మింగ్‌కు సంకేతం" అని అభివర్ణించింది.




**- టెక్కలిలో రైలు ఢీకొని నలుగురు బాలురు దుర్మరణం - అందరూ ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు**

**టెక్కలి, సెప్టెంబర్ 23 (వన్‌నేషన్):** వెనుక నుంచి రైలు ఢీకొనడంతో నలుగురు బాలురు అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి సమీపంలో బుధవారం మధ్యాహ్నం ఈ ఘోరం జరిగింది. పోలీసులు, కుటుంబీకుల కథనం మేరకు.. టెక్కలి, మెళియాపుట్టి మండలాలకు చెందిన నలుగురు ఇంటర్ విద్యార్థులు టెక్కలి జూనియర్ కళాశాలలో చదువుతున్నారు. బుధవారం సెలవు కావడంతో వీరంతా కాలవలో చేపలవేటకు వెళ్లి చేపలు పట్టుకుని తిరుగుముఖం పట్టారు. నౌపడా నుంచి గుణుపూర్ వెళ్లే రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 12.45గంటలకు టెక్కలి సమీపంలో గల రావివలస జంక్షన్ బర్మా కాలనీ ప్రాంతానికి చేరుకుంది. ఆ సమయంలో వర్షం జోరుగా కురుస్తోంది. నలుగురు బాలురు ట్రాక్‌పై నడుస్తుండగా వెనుక నుంచి వచ్చిన రైలు వీరిని ఢీకొట్టింది. ఈ సమయంలో వీరు ఇయర్‌ఫోన్స్ పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ప్రమాదంలో టెక్కలి మండలం మొఖలింగాపురం పంచాయతీ డమర గ్రామానికి చెందిన జన్ని దిలీప్(16), గంగువాడ విశాఖరావు(16), మేఘువరం పంచాయతీ చిన్నభీంపురం గ్రామానికి చెందిన జన్ని శరత్(16), మెళియాపుట్టికి చెందిన సవర శివ(16) అక్కడికక్కడే మృతిచెందారు. వీరితోపాటు వస్తున్న డమర గ్రామానికి చెందిన జన్ని సాల్మన్‌రాజు ట్రాక్ పక్కన నడుస్తుండగా.. రైలు ఇంజన్ చివర తగిలి పక్కకు పడిపోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. అతడికి చేయి, కాలు విరిగాయి. హుటాహుటిన శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. గంటన్నరకు పైగా రైలును అక్కడే నిలిపివేశారు.




# మాదకద్రవ్య రహిత భవిష్యత్తుకు వ్యూహాత్మక ప్రణాళిక

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (వన్‌నేషన్):** మాదకద్రవ్య నియంత్రణ విజన్ డాక్యుమెంట్ (2026–2029) భారతదేశంలో డ్రగ్స్ సమస్యను ఎదుర్కొనే విధానంలో కీలక మార్పును సూచిస్తోంది. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను కేవలం శాంతిభద్రతల సమస్యగా కాకుండా, అమలు, నిఘా, డిమాండ్ తగ్గింపు, సాంకేతికత మరియు సంస్థాగత సామర్థ్యాలతో కూడిన బహుముఖ సవాలుగా ఈ పత్రం




పరిగణిస్తోంది. భారత్ భౌగోళికంగా ప్రధాన మాదకద్రవ్య ఉత్పత్తి ప్రాంతాల మధ్య ఉండటంతో అక్రమ రవాణాకు గురయ్యే అవకాశం ఉంది. డ్రోన్లు, సముద్ర మార్గాలు, డార్క్‌నెట్, క్రిప్టోకరెన్సీ వంటి ఆధునిక సాంకేతిక పద్ధతులను నేర ముఠాలు వినియోగిస్తున్నాయి. దీంతో సంప్రదాయ నియంత్రణ విధానాలతో పాటు ఆధునిక నిఘా వ్యవస్థలు అవసరమవుతున్నాయి.

### నాలుగు ప్రధాన స్తంభాలు

1. అమలు, నిఘా మరియు ఆపరేషన్లు -- వ్యక్తిగత స్వాధీనాలకే పరిమితం కాకుండా మొత్తం డ్రగ్ నెట్‌వర్క్‌లను గుర్తించి నిర్వీర్యం చేయడం. 2. ప్రీకర్సర్ మరియు సింథటిక్ డ్రగ్ నియంత్రణ -- ల్యాబొరేటరీల్లో తయారయ్యే డ్రగ్స్‌ను అరికట్టేందుకు నియంత్రణ, నిఘాను బలోపేతం చేయడం. 3. డిమాండ్ తగ్గింపు మరియు పునరావాసం -- డ్రగ్స్ సరఫరాను అడ్డుకోవడంతో పాటు అవగాహన, చికిత్స, పునరావాసానికి ప్రాధాన్యత ఇవ్వడం. 4. సామర్థ్య నిర్మాణం, సమన్వయం మరియు పర్యవేక్షణ -- వివిధ సంస్థల మధ్య సమాచార మార్పిడి, సాంకేతికత, సమన్వయం మరియు జవాబుదారీతనాన్ని పెంచడం.

### సమగ్ర విధానం

డ్రగ్ నియంత్రణ కేవలం పోలీసు, భద్రతా సంస్థల బాధ్యత కాకుండా కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు, ఆరోగ్య సంస్థలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు మరియు సమాజం మొత్తం కలిసి పనిచేయాల్సిన అంశంగా పత్రం పేర్కొంటోంది. సంక్షిప్తంగా, 2026--2029 విజన్ డాక్యుమెంట్ మాదకద్రవ్య నియంత్రణలో ప్రతిస్పందనాత్మక విధానం నుంచి సమన్వయంతో కూడిన, నిఘా ఆధారిత, నివారణ మరియు పునరావాస కేంద్రిత విధానానికి మార్పును లక్ష్యంగా పెట్టుకుంది.

# నిబంధనలు గాలికి... నిర్మాణాలు జోరుగా!

## - కైతలాపూర్ శ్రీరామ్ నగర్ కాలనీలో అనుమతులపై అనుమానాలు -

## భవన నిర్మాణాలపై అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు స్థానికుల డిమాండ్

**కూకట్‌పల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 23 (వన్‌నేషన్):** కూకట్‌పల్లి పరిధిలోని కైతలాపూర్ శ్రీరామ్ నగర్ కాలనీలో భవన నిర్మాణాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణ నిబంధనలకు అనుగుణంగా అనుమతులు తీసుకున్నారా? లేక అనుమతులకు మించి నిర్మాణాలు చేపడుతున్నారా? అనే ప్రశ్నలు స్థానికులలో తలెత్తుతున్నాయి. కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనాలకు సంబంధించిన భవనాలకు మంజూరైన బిల్డింగ్ పర్మిషన్లు, అనుమతించిన అంతస్తులు, ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణ తదితర అంశాలపై అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.




### అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా..?

స్థానికుల ఆరోపణల ప్రకారం కొన్ని నిర్మాణాలలో మంజూరైన అనుమతులకు మించి నిర్మాణాలు చేపడుతున్నారని అనుమానాలు ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలు వాస్తవమా కాదా అన్నది సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి నిర్ధారించాల్సి ఉంది. నిర్మాణ అనుమతులు, మంజూరైన ప్లాన్, నిర్మించిన అంతస్తులు, సెట్ బ్యాక్ లు తదితర అంశాలను పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




### అధికారుల తనిఖీకి డిమాండ్

శ్రీరామ్ నగర్ కాలనీలో నిర్మాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అనుమతులు-వాస్తవ నిర్మాణాలపై సమగ్ర తనిఖీ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్మాణాలు జరుగుతున్నట్లయితే ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు అధికారులు స్పష్టత ఇవ్వాలని, ఉల్లంఘనలు ఉన్నట్లయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. కైతలాపూర్ శ్రీరామ్ నగర్ కాలనీలో జరుగుతున్న ఈ నిర్మాణాలపై అధికారులు తనిఖీ ఎప్పుడు జరుగుతుందో... ఉల్లంఘనలు ఉన్నాయా? లేదా? అన్నది అధికారుల పరిశీలనతోనే తేలాల్సి ఉంది

# స్టీల్ పరిశ్రమ విస్తరిస్తున్న నేపథ్యంలో భారత్ గ్లోబల్ ఫెర్రో-అలాయ్స్ హబ్‌గా తన స్థానాన్ని బలోపేతం చేసుకోగలదు: IFAPA

**- భారత్ 300-మిలియన్-టన్నుల స్టీల్ సామర్థ్యం వైపు అడుగులు వేస్తున్న నేపథ్యంలో పరిశ్రమ బలమైన ముడిసరుకు భద్రత మరియు పోటీతత్మక ఇన్‌పుట్ ఖర్చులను కోరుతోంది**




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 (వన్‌నేషన్):** భారత్‌లో విస్తరిస్తున్న స్టీల్ పరిశ్రమ దేశీయ ఫెర్రో-అలాయ్స్ రంగానికి కొత్త వృద్ధి అవకాశాన్ని సృష్టిస్తోందని, అలాగే గ్లోబల్ మార్కెట్లలో దేశం తన స్థానాన్ని బలోపేతం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తోందని ఇండియన్ ఫెర్రో అల్లాయ్ ప్రొడ్యూసర్స్' అసోసియేషన్ (IFAPA) గోవాలో నిర్వహించిన 6th International Ferro Alloys Conference (IFAC 2026)లో తెలిపింది. IFAPA నిర్వహిస్తున్న ఈ సదస్సు Fueling Indiaꞌs Steel Surge: The Rising Importance of Ferro Alloys అనే థీమ్‌తో జరుగుతోంది. వనరుల భద్రత మరియు పోటీతత్మకత ప్రధాన దృష్టి అంశాలుగా ఉన్నాయి.

క్యాలెండర్ సంవత్సరం 2025లో భారత్ క్రూడ్ స్టీల్ ఉత్పత్తి సుమారు 165 మిలియన్ టన్నులకు చేరుకుంది, ఇది ఏడాది ప్రాతిపదికన 10% కంటే ఎక్కువ వృద్ధిని నమోదు చేసింది. స్టీల్ డిమాండ్ కూడా సంవత్సరానికి సుమారు 7% చొప్పున పెరుగుతూనే ఉంటుందని అంచనా. ఈ వృద్ధి, స్పెషలైజ్ స్టీల్స్‌కు పెరుగుతున్న డిమాండ్‌తో కలిసి, మాంగనీస్, క్రోమియం, సిలికాన్ మరియు ఇతర అల్లాయింగ్ ఇన్‌పుట్‌లకు అవకాశాలను విస్తరిస్తోంది. భారత్ FY31 నాటికి సుమారు 300 మిలియన్ టన్నుల స్టీల్ తయారీ సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది మాంగనీస్, క్రోమియం, సిలికాన్ మరియు ఇతర అల్లాయింగ్ ఇన్‌పుట్‌లకు ఉన్న అవకాశాన్ని గణనీయంగా విస్తరిస్తుంది.

భారత్ వినియోగంలో కూడా ఒక ముఖ్యమైన మైలురాయిని దాటింది. తలసరి స్టీల్ వినియోగం 1991లో సుమారు 24 kg నుంచి 2025లో సుమారు 109 ఎస్జీకు పెరిగింది. భారత్ ఇప్పుడు 100-ఎస్జీ స్థాయిని దాటినందున, వినియోగ వృద్ధి తదుపరి దశ స్టీల్ అవసరాన్ని, దాని ఫలితంగా స్టీల్ ఉత్పత్తికి అవసరమైన ఫెర్రో అలాయ్స్ డిమాండ్‌ను గణనీయంగా పెంచగలదు.

ఇండియన్ ఫెర్రో అల్లాయ్ ప్రొడ్యూసర్స్' అసోసియేషన్ (IFAPA) చైర్మన్ శ్రీ మనీష్ సర్దా మాట్లాడుతూ, "ప్రపంచ స్థాయిలో పోటీతత్మకంగా మారడానికి మరియు ఆత్మనిర్భర్ భారత్ దృష్టికోణానికి మద్దతు ఇవ్వడానికి భారతీయ ఫెర్రో-అలాయ్ ఉత్పత్తిదారులకు కీలకమైన ముడిసరుకుల స్వదేశీ వనరులను భద్రపరచడం ప్రాధాన్యతగా ఉండాలి. దేశీయ మాంగనీస్, క్రోమ్ మరియు ఇతర కీలక ఖనిజాల అన్వేషణ, అభివృద్ధిని వేగవంతం చేయాలి. అనేక మాంగనీస్ ఓర్ గనులను అధిక ప్రీమియంతో వేలం వేసినప్పటికీ, ఆర్థికంగా అనుకూలంగా లేకపోవడం వల్ల చాలా గనులు ఇప్పటికీ కార్యకలాపాలు ప్రారంభించలేదు. కాబట్టి వేలం విధానాలు అత్యధిక బిడ్‌కే కాకుండా వాస్తవిక గని అభివృద్ధి మరియు ఉత్పత్తిని ప్రోత్సహించాలి. ఉత్పత్తి చేసే గని పరిశ్రమకు, ఆర్థిక వ్యవస్థకు విలువను సృష్టిస్తుంది; ఆర్థికంగా అనుకూలం కాని గని అలా చేయదు. దేశీయ ఖనిజ వనరులకు వాణిజ్యపరంగా సాధ్యమైన ప్రాప్యత దిగుమతి ఆధారపడటాన్ని తగ్గించడానికి మరియు బలమైన, స్వయం సమృద్ధి గల ఫెర్రో-అలాయ్స్ పరిశ్రమను నిర్మించడానికి కీలకం అవుతుంది."

భారత్ 300 మిలియన్ టన్నుల స్టీల్ తయారీ సామర్థ్యం వైపు కదులుతున్న నేపథ్యంలో ఇన్‌పుట్ ఖర్చుల పోటీతత్మకతను మెరుగుపరచాల్సిన అవసరాన్ని IFAPA కూడా ప్రస్తావించింది. తగిన దేశీయ గ్రేడ్లు అందుబాటులో లేని చోట మాంగనీస్ ఓర్ మరియు నోబుల్ అలాయ్స్‌కు అవసరమైన ముడిసరుకులపై జీరో డ్యూటీలను దిగుమతి విధానం పరిగణించాలని తెలిపింది. ఇంధన-సాంద్రత అధికంగా ఉన్న ఫెర్రో-అలాయ్ ఉత్పత్తిదారులకు పోటీతత్మక విద్యుత్ ఖర్చులు మరియు విద్యుత్ సంబంధిత ఛార్జీలు, లెవీలను హేతుబద్ధీకరించాలని అసోసియేషన్ కోరింది. ఫెర్రో అలాయ్స్ స్టీల్ బలం, కాఠిన్యం మరియు తుప్పు నిరోధకతను మెరుగుపరచడానికి ఇనుమును మాంగనీస్, క్రోమియం మరియు సిలికాన్ వంటి మూలకాలతో కలుపుతాయి. మౌలిక సదుపాయాలు, ఆటోమొబైల్స్, రైల్వేలు, రక్షణ మరియు ప్రత్యేక అనువర్తనాల కోసం స్టీల్ ఉత్పత్తిలో ఇవి అవసరం.

స్టీల్ డిమాండ్‌లో మారుతున్న కూర్పు కూడా అవకాశాలను విస్తరిస్తోంది. BigMint డేటా ప్రకారం, సిలికో-మాంగనీస్ ఉత్పత్తి FY20లో సుమారు 1.9 మిలియన్ టన్నుల నుంచి FY26లో దాదాపు 3.5 మిలియన్ టన్నులకు పెరిగింది. ఫెర్రో-మాంగనీస్ ఉత్పత్తి సుమారు 0.9 మిలియన్ టన్నుల నుంచి దాదాపు 1.7 మిలియన్ టన్నులకు పెరిగింది. ఈ ధోరణి భారత్ విస్తరిస్తున్న స్టీల్ రంగం నుంచి పెరుగుతున్న డిమాండ్‌ను ప్రతిబింబిస్తోంది.

BigMint ప్రకారం, 2025లో భారత్ ప్రపంచంలోనే మాంగనీస్ అలాయ్స్‌కు అగ్రగామి ఎగుమతిదారుగా నిలిచింది. పెరుగుతున్న దేశీయ మార్కెట్‌తో పాటు ఇప్పటికే ఉన్న ఎగుమతి ఆధారం భారతీయ ఉత్పత్తిదారులకు మరింత విస్తరించడానికి మరియు గ్లోబల్ సప్లై చైన్లలో తమ స్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి అవకాశాన్ని ఇస్తోంది.

అయితే ముడిసరుకు భద్రత కీలకంగానే ఉంది. 2026 మొదటి అర్ధభాగంలో భారత్ మాంగనీస్ ఓర్ దిగుమతులు ఏడాది ప్రాతిపదికన 27% పెరిగి 4.03 మిలియన్ టన్నులకు చేరాయి. అదే సమయంలో, F2025-26లో క్రోమ్ ఓర్ ఉత్పత్తి 12% పెరిగి 3.53 మిలియన్ టన్నులకు చేరగా, ఫెర్రో-క్రోమ్ ఉత్పత్తి 10% పెరిగి 1.49 మిలియన్ టన్నులకు చేరింది. ఇది దిగుమతుల సవాలుతో పాటు దేశీయ విలువ వృద్ధికి ఉన్న అవకాశాన్ని కూడా స్పష్టం చేస్తోంది.

IFAC 2026లో 700 మందికి పైగా పాల్గొనేవారు, 35 మంది స్పీకర్లు మరియు 150 నాలెడ్జ్ సెషన్లు ఉన్నాయి. వీటిలో మాంగనీస్ భద్రత, స్టీల్ మరియు అలాయ్ డిమాండ్, గ్లోబల్ ట్రేడ్, ఫెర్రో-క్రోమ్ మరియు ఫెర్రో-సిలికాన్, ఇంధన సామర్థ్యం మరియు కీలక ఖనిజాలు వంటి అంశాలు ఉన్నాయి. ఈ కార్యక్రమం Sarda Group, MOIL, JSW Steel, MFA, Shyam Metalics, Eramet, The Sandur Manganese & Iron Ores Limited (SMIORE), SAIL, Sumitomo Metal Mining, Nava Limited, Hira Group of Industries మరియు International Manganese Institute తదితర సంస్థల సీనియర్ నాయకులను ఒకచోటికి తీసుకువస్తోంది.

ఇండియన్ ఫెర్రో అల్లాయ్ ప్రొడ్యూసర్స్' అసోసియేషన్ 1961లో స్థాపించబడింది. గత 64 సంవత్సరాల్లో IFAPA ఫెర్రో అలాయ్స్ పరిశ్రమకు అపెక్స్ బాడీగా అభివృద్ధి చెంది, భారతదేశంలోని బల్క్ మరియు నోబుల్ ఫెర్రో అలాయ్ ఉత్పత్తిదారుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తోంది. పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించడానికి, ప్రభుత్వంతో చర్చలు జరపడానికి మరియు పరిశ్రమ దీర్ఘకాలిక అభివృద్ధికి తోడ్పడే పరిష్కారాల కోసం పనిచేయడానికి ఇది ఒక వేదికను అందించింది.

# నాగోల్ చెరువులో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

**- ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేత**



**నాగోల్; సెప్టెంబర్, 23 (వన్ నేషన్):** నాగోల్ డివిజన్ పరిధిలోని నాగోల్ చెరువులోకి కాలువల ద్వారా కలుస్తున్న కలుషితమైన మురుగునీటి కారణంగా తీవ్ర దుర్గంధం వెలువడుతూ, పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యపై ఈరోజు గౌరవ మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ గారిని కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది.నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ శ్రీమతి చింతల అరుణ సురేందర్ యాదవ్ గారి ఆధ్వర్యంలో స్థానిక ప్రజల సమస్యను ఎంపీ గారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. నాగోల్ చెరువులోకి వివిధ కాలువల ద్వారా చేరుతున్న కలుషితమైన, దుర్గంధపూరితమైన మురుగునీటి కారణంగా చెరువు పరిసర ప్రాంతాల్లో తీవ్రమైన దుర్వాసన వ్యాపిస్తోందని, దీంతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.ముఖ్యంగా చెరువు నీటి కాలుష్యం, దుర్గంధం, పరిసర ప్రాంతాల్లో వాతావరణంపై ప్రభావం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఎంపీ గారి దృష్టికి తీసుకెళ్లారు. మురుగునీరు చెరువులోకి చేరకుండా తగిన చర్యలు చేపట్టడంతో పాటు, ఇప్పటికే చెరువులో చేరిన కలుషిత నీటి సమస్యకు కూడా తక్షణ పరిష్కారం చూపాలని కోరారు.స్థానిక ప్రజల సమస్యను సానుకూలంగా విన్న ఎంపీ శ్రీ ఈటల రాజేందర్ వెంటనే స్పందించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు త్వరితగతిన చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించే దిశగా చర్యలు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ గారు జోనల్ కమిషనర్ గారితో ఫోన్‌లో మాట్లాడి నాగోల్ చెరువులో మురుగునీటి సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.నాగోల్ చెరువు కేవలం ఒక జలవనరు మాత్రమే కాకుండా, పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ముఖ్యమైన ఆహ్లాదకరమైన ప్రదేశమని, చెరువును కాలుష్యం నుంచి కాపాడి పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.స్థానిక ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని చింతల అరుణ సురేందర్ యాదవ్, తెలిపారు. కాలనీ వాసులు దామోదర్ రెడ్డి. ప్రభాకర్. G.రాజేందర్ రెడ్డి మోహన్ రెడ్డి. దర్శన్ రెడ్డి. ూఎచీ రెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# మేడ్చల్ చెరువులకు మహర్దశ..

**- అభివృద్ధి నిధుల మంజూరు కు సీఎం రేవంత్ సానుకూలం... - హైడ్రా కమిషనర్ ను కలిసిన వజ్రేష్ యాదవ్...**




**మేడ్చల్, మేడిపల్లి /సెప్టెంబర్ 23/వన్ నేషన్ :** మేడ్చల్ అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలోని చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ మరియు సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరగా ఆయ న సానుకూలంగా స్పందించి నట్లు మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజక వర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ తెలిపారు.

సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వజ్రెష్ యాదవ్ తాజాగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిసి, నియోజకవర్గంలోని ప్రధాన చెరువుల సమగ్ర వివరాల తో కూడిన నివేదికను అంద జేశారు.

### హైడ్రా కమిషనర్‌కు వివరించిన ప్రధాన చెరువు లు:

బోడుప్పల్: రా చెరువు, చెంగిచెర్ల: చింతల చెరువు, ఎదులాబాద్: ఎదులాబాద్ చెరువు, రాంపల్లి: సూర్యనారాయణ చెరువు, పీర్జాదిగూడ: పెద్ద చెరువు,

### చెరువుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి:

ఈ సందర్భంగా వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని చెరువు లను అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవడంతో పాటు, పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణ, కట్టల బలోపేతం, నీటి నిల్వ సామర్థ్యం పెంపు వంటి పనులకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని సీఎం ను కోరినట్లు తెలిపారు. చెరువుల అభివృద్ధి పూర్త యితే వర్షపు నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని, తద్వారా పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెంది పర్యావరణ పరిరక్షణకు ఎంతో ప్రయోజనం చేకూరు తుంద ని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మేడ్చల్ నియోజక వర్గంలోని జల వ నరుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.





హైదరాబాద్, సెప్టెంబర్ 23 (వన్‌నేషన్): గణేష్ నవరాత్రుల్లో భాగంగా మన్సురాబాద్,హయత్ నగర్ డివిజన్ల పరిధిలోని లెక్చరర్స్ కాలనీ,వినాయక కాలనీ,సౌజన్య కాలనీ,అయ్యప్ప స్వామి దేవాలయం నందు నెలకొల్పిన గణనాధుని దర్శించుకున్న ఎల్బీనగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు.ఇట్టి కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 14 నగరాల్లో 16 వర్క్‌స్పేస్ కేంద్రాలతో దక్షిణ భారతదేశంలో తన ఉనికిని బలోపేతం చేసుకుంటున్న మైబ్రాంచ్

**- ప్రాంతీయ కార్యాలయాలకు నిరంతర డిమాండ్ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలలో 50,000 చదరపు అడుగుల నెట్‌వర్క్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (వన్‌నేషన్):** దేశవ్యాప్త ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్, మేనేజ్డ్ ఆఫీస్ ప్రొవైడర్ అయిన మైబ్రాంచ్ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ – నాలుగు రాష్ట్రాల్లోని 14 నగరాల్లో 16 కేంద్రాలలో 50,000 చదరపు అడుగుల వర్క్ స్పేస్‌ను ఏర్పాటు చేసి, దక్షిణ భారతదేశంలో తన ఉనికిని బలోపేతం చేసుకుంటోంది. వ్యాపార సంస్థలు సంప్ర దాయ మెట్రో నగరాలకు ఆవల ప్రాంతీయ బృందాలను, కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నందున, ఫ్లెక్సిబుల్ ఆఫీస్ మౌలిక సదుపాయాలకు పెరుగుతున్న డిమాండ్‌ను ఈ నెట్‌వర్క్ ప్రతిబింబిస్తుంది. మైబ్రాంచ్ దక్షిణ భారత నెట్‌వర్క్ బెంగళూరు, కోయంబత్తూరు, గుంటూరు, హనుమకొండ, హుబ్బళ్లి, హైదరాబా ద్, మదురై, మంగళూరు, రాజమండ్రి, సేలం, తిరుపతి, వెల్లూరు, విజయవాడ, విశాఖపట్నంలలో విస్తరించి ఉంది. ఇది ఇప్పటికే స్థిరపడిన వ్యాపార కేంద్రాలతో పాటు అభివృద్ధి చెందుతున్న వాణిజ్య మార్కెట్లను కూడా కవర్ చేస్తుంది. త్వరలో చెన్నైలో కూడా ఒక పెద్ద కార్యాలయ స్థలం ప్రారంభం కానుంది.

ఈ ప్రాంతమంతటా కార్యాలయ కార్యకలాపాలు నిరంతరాయంగా కొనసాగుతున్న తరుణంలో మైబ్రాంచ్ దక్షిణ భారత నెట్‌వర్క్ ప్రారంభమవుతోంది. జేఎల్ఎల్ ఇండియా ఆఫీస్ మార్కెట్ డేటా ప్రకారం, 2026 మొదటి అర్ధ భాగంలో భారతదేశ నికర కార్యాలయ వినియోగంలో (నెట్ ఆఫీస్ అబ్సార్షన్) బెంగళూరు, హైదరాబాద్ కలిసి 49.7% వాటాను కలిగి ఉన్నాయి. ఇందులో బెంగళూరు 30.9%, హైదరాబాద్ 18.8% వాటాను అందించా యి. అలాగే, 2026 రెండో త్రైమాసికంలో భారతదేశ స్థూల లీజింగ్ పరిమాణంలో (గ్రాస్ లీజింగ్ వాల్యూమ్స్) చెన్నై 13.9% వాటాను కలిగి ఉంది. భారతదేశంలో ఒక కీలకమైన కార్యాలయ మార్కెట్‌గా దక్షిణ భారతదేశ నిరంతర ప్రాముఖ్యతను ఈ డేటా ప్రముఖంగా చాటిచెబుతుంది. ఈ డిమాండ్‌లో ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్ కూడా ఒక ముఖ్యమైన భాగంగా మారుతోంది. జేఎల్ఎల్ ప్రకారం, 2026 మొదటి అర్ధభాగంలో భారతదేశ స్థూల ఆఫీస్ లీజింగ్‌లో ఫ్లెక్స్ వాటా 27%గా ఉంది, తద్వారా టెక్నాలజీ తర్వాత ఇది రెండవ అతిపెద్ద డిమాండ్ విభాగంగా నిలిచింది. కొత్త మార్కెట్లలోకి ప్రవేశించే, శాటిలైట్ బృందాలను ఏర్పాటు చేసే లేదా ప్రాంతీయ కార్యకలాపాలను విస్తరించే కంపెనీలకు, ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్‌లు సంప్రదాయ కార్యాలయాల కంటే వేగవంతమైన, మరింత అనుకూలమైన ప్రత్యామ్నాయాన్ని అందిస్తాయి. ఇది ఇప్పటికే స్థిరపడిన, అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో వృత్తిపరంగా నిర్వహించబడే వర్క్ స్పేస్ లను అందుబాటులోకి తెస్తుంది. వ్యాపారాలు భౌగోళికంగా విస్తరిస్తున్న కొద్దీ, ఈ వికేంద్రీకృత నమూనాకు ప్రాము ఖ్యత పెరుగుతుందని మేం భావిస్తున్నాం" అని మైబ్రాంచ్ వ్యవస్థాపకుడు కుశాల్ భార్గవ అన్నారు.

మైబ్రాంచ్ దక్షిణ భారతదేశ నెట్‌వర్క్ భారతదేశం అంతటా వర్క్ స్పేస్ నెట్‌వర్క్‌ను నిర్మించే తన విస్తృత వ్యూహంలో ఒక భాగం. ఇది తమ కార్యకలాపాలను స్థాపించడానికి లేదా విస్తరించడానికి చూస్తున్న ఎంటర్‌ప్రైజెస్, బహుళజాతి సంస్థలు (ఎంఎన్సీలు), గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు (జీసీసీలు), స్టార్టప్‌లు, అభివృద్ధి చెందుతున్న వ్యాపార సంస్థలకు మద్దతు ఇస్తుంది. దక్షిణ భారతదేశం అంతటా ఉన్న తన వికేంద్రీకృత నెట్‌వర్క్‌తో, మైబ్రాంచ్ ఇప్పటికే స్థిరపడిన, అభివృద్ధి చెందు తున్న మార్కెట్లలో ప్రాంతీయ కార్యాలయాలు, శాటిలైట్ బృందాలు, సౌకర్యవంతమైన వర్క్ స్పేస్ పరిష్కారాలను కోరుకునే వ్యాపార సంస్థలకు మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. ఇది దక్షిణ భారతదేశం అంతటా నిర్వహించ బడే కార్యాలయ స్థలాలను కూడా అందిస్తుంది. వ్యాపారాలకు వారి కార్యాచరణ అవసరాలకు అనుగుణంగా, ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్న, అనుకూలీకరించిన కార్యస్థలాలను అందిస్తుంది.

# ఛత్రినాకలో 59వ వార్షిక గణేష్ నవరాత్రి ఉత్సవాలు




**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (వన్‌నేషన్):** 59వ వార్షిక గణేష్ నవరాత్రి ఉత్సవాల జరుపుకుంటున్న ఛత్రినాక మిత్ర యువజన సంఘం గణేష్ మండపాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ, అభివృధి సలహాదారులు, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంత రావు సందర్శించి గణపతికి ప్రత్యేక పూజలు, హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు వి.హెచ్ కు శాలువ కప్పి ఘనంగా సన్మానించి ప్రసాదని అందచేసారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.పి.కాంతి కుమార్, సిఎఫ్ఐ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, సంఘం ప్రతినిధులు కె.భరద్వాజ్, బి.నితిన్ చారి, సంతోష్, ఎస్.కరణ్, బి.వెంకటేష్, కె.సరోజ్, దుర్గా ప్రసాద్, రితేష్, రిషి, అభిలాష్, యజత్, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

# కర్మన్‌ఘాట్ ఆరంజ్ ఎస్టెల్లా అపార్ట్మెంట్‌లో ఘనంగా అన్న ప్రసాదం



**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (వన్‌నేషన్):** ఎల్బీనగర్ నియోజకవర్గం, కర్మన్‌ఘాట్‌లోని ఆరంజ్ ఎస్టెల్లా అపార్ట్మెంట్‌లో వినాయక ఉత్సవాల సందర్భంగా అన్న ప్రసాదం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అపార్ట్మెంట్ వాసులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నిర్వాహకులు భక్తులకు ప్రసాద వితరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యులు అధ్యక్షులు అల్వాల్ రెడ్డి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్,కల్చరల్ కమిటీ సభ్యులు డాక్టర్ వినోద్, శరత్ చంద్ర, మోహన్, ఆహార పంపిణీ కార్యక్రమాన్ని జరిపించిన వారు జైని పురుషోత్తం. ఈ కార్యక్రమంలో బంధువులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

# బాలాపూర్ గణేషుడిని దర్శించుకున్న కేటీఆర్

**బాలాపూర్, సెప్టెంబర్ 23 (వన్‌నేషన్):** ప్రసిద్ధ బాలాపూర్ గణనాథుడిని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలిసి ఎమ్మెల్యేలు,సుధీర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి బుధవారం మాజీ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దర్శించుకున్నారు. బాలాపూర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కల్లెం నిరంజన్ రెడ్డి మరియు ఉత్సవ కమిటీ సభ్యులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాలాపూర్ మహా గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. పూజా





కార్యక్రమాల అనంతరం నిర్వాహకులు ఆయనను తీర్థప్రసాదాలతో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ప్రజలందరూ కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని త్వరలోనే కెసిఆర్ ముఖ్యమంత్రి అవుతారని ఆయన ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో గణేష్ నిమజ్జన బందోబస్తు రోల్‌కాల్ నిర్వహణ...

**మేడిపల్లి/సెప్టెంబర్ 23/వన్ నేషన్ :** గణేష్ నిమజ్జన వేడుకలను అత్యంత ప్రశాంతంగా, సజా వుగా నిర్వహించేందుకు మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో బుధవారం సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక బందో బస్తు రోల్‌కాల్ నిర్వహిం చారు. మేడిపల్లి ఎస్‌హెచ్ ఓ, ఇన్‌స్పెక్టర్ డి. జలందర్ మరియు డిఐ శ్రీనివాస్ ఈ కార్యక్రమానికి హాజరై, బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బందికి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.



ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ డి. జలందర్ మాట్లాడుతూ, గణేష్ ఊరేగింపు మార్గాలు, నిమజ్జన ప్రదేశాలుమరియు ప్రతి సిబ్బందికి కేటాయించి న డ్యూటీ పాయింట్లపై స్పష్టతనిచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సిబ్బంది అందరూ అత్యంత అప్రమ త్తంగా వ్యవహరించాలని, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా జనసందోహాన్ని నియంత్రిం చడం, పటిష్టమైన ట్రాఫిక్ నిర్వహణ చేపట్టడం మరి యు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసే బాధ్యత పోలీసులపై ఉందని గుర్తుచేశారు. అలాగే, నిమజ్జన వేడుకల్లో డీజేలు మరియు అధిక శబ్దం నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించా రు. భక్తుల భద్రతకు అత్యం త ప్రాధాన్యతనిస్తూ, విధి నిర్వహణలో సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన పలువురు అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నా రు.

# నేడు, రేపు భారీ వర్షాలు

**- బుధవారం పలు జిల్లాల్లో మోస్తరు వానలు - ఈదురు గాలుల బీభత్సం.. పిడుగుపాటుకు ముగ్గురు మహిళా కూలీల మృతి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (వన్‌నేషన్):** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. కొన్నిప్రాంతాల్లో ముసురు కమ్ముకోగా, మరికొన్ని చోట్ల భారీ వర్షాలు పడ్డాయి. గురు, శుక్రవారాల్లో కూడా కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 5 జిల్లాలకు రెడ్ అలర్ట్, 8 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో గురువారం అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిస్తూ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగతా జిల్లాలకు యెల్లో అలర్ట్ ఇచ్చింది. శుక్రవారం కూడా పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్, యెల్లో అలర్ట్ జారీ చేసింది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు రాష్ట్రంలో 128 మండలాలు మినహా మిగిలిన అన్ని చోట్లా తేలికపాటి నుంచి మోస్తరు, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసినట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బుధవారం ఒక మోస్తరు వర్షం కురిసింది. ఖమ్మం జిల్లాలో ఉదయం 8-30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 1.21 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కల్లూరులో 6.28 సెం.మీ వర్షం కురిసింది.



# జగ్గారెడ్డి కృషితో భూములు కోల్పోయిన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (వన్‌నేషన్):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం వెలువడ్డ మొట్టమొదటి జి వో. ఇళ్ల స్థలాల పంపిణీ పై గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాం లోనుండి కొనసాగుతున్న నిషేధం. జగ్గారెడ్డి విజ్ఞప్తి మేరకు తొగర్ పల్లి లో ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం 13 ఏళ్ల లో రాష్ట్రం లో మొట్టమొదటిసారిగా విడుదలైన జి.వో. తొగర్‌పల్లి సర్వే నం.418లో 93 మంది లబ్ధిదారులకు 125 గజాల చొప్పున ఇంటి పట్టాలు పంపిణీ చేసిన నిర్మలా జగ్గారెడ్డి. ఏళ్ల తరబడి సొంతింటి స్థలం కోసం ఎదురుచూస్తున్న పేదల నిరీక్షణకు తెరపడింది. తొగర్‌పల్లి, అలియాబాద్ గ్రామాలకు చెందిన భూములు కోల్పోయిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తొగర్‌పల్లి సర్వే నంబర్ 418లో మొత్తం 93 మంది లబ్ధిదారులకు 125 గజాల చొప్పున స్థలాలను కేటాయిస్తూ పట్టాలు అందజేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గతంలో ఇళ్ల స్థలాల కోసం పట్టాలు పొందినప్పటికీ, తదనంతర పరిణామాలతో లబ్ధిదారులకు స్థలాల పొజిషన్ అందకపోవడంతో సమస్య కొనసాగుతూ వచ్చింది. దీంతో తమకు కేటాయించిన స్థలాలను చూపించి, సొంతింటి కలను సాకారం చేయాలని లబ్ధిదారులు పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతూ వచ్చారు.

### 2011లో కేటాయింపులు.. ఆ తర్వాత నిలిచిన ప్రక్రియ

తొగర్‌పల్లి, అలియాబాద్ ప్రాంతాల్లో భూములు కోల్పోయిన కుటుంబాలకు గతంలో ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ చేపట్టారు. అయితే ప్రభుత్వం మారిన అనంతరం గతంలో జరిగిన కేటాయింపులు



అమలులోకి రాకపోవడంతో లబ్ధిదారులు స్థలాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ సమస్యపై మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించారు.

### మంత్రి పొంగులేటిని కలిసిన జగ్గారెడ్డి

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గత సంవత్సరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. అనంతరం మంత్రి అప్పటి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఫోన్ చేసి, లబ్ధిదారులకు పొజిషన్ చూపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

### నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా పట్టాల పంపిణీ

తొగర్‌పల్లి సర్వే నంబర్ 418లో లబ్ధిదారులకు నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, కొండాపూర్ తహసీల్దార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యనగర్ కాలనీలో ఘనంగా ప్రత్యేక పూజలు



### ప్రజల సుఖసంతోషాలు, రైతుల సంక్షేమం కోసం ప్రార్థనలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (వన్‌నేషన్):** ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ అల్వాల్ సూర్యనగర్ కాలనీ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, రైతులు సంతోషంగా ఉండేలా ప్రకృతి అనుకూలించి విస్తారంగా వర్షాలు కురవాలని ప్రార్థనలు చేశారు.

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్రంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని, ప్రతి కుటుంబం ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని పూజల సందర్భంగా ఆకాంక్షించారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. పండుగలను సామూహికంగా నిర్వహించడం ద్వారా వ్యక్తిగత భావన నుంచి సమాజమంతా ఒక్కటేననే 'మనం' అనే భావన బలపడుతుందని అన్నారు. ఆర్భాటం, పోటీతత్వానికి ప్రాధాన్యం ఇవ్వకుండా పరస్పర సహకారం, సామాజిక అనుబంధాలు, ఐక్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

బాలల సేవా విభాగం ఆధ్వర్యంలో చిన్నారులకు



పాటలు, ఆటల పోటీలు నిర్వహించి ఉత్సాహపరిచారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు రామ్‌రెడ్డి బహుమతులు అందజేసి అభినందించారు.

ఈ కార్యక్రమంలో సూర్యనగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు నరేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, భూపాల్, రఘువీర్, మురళీగౌడ్, ఎన్. శేఖర్, రాజ్‌కుమార్, నేకనార్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**